క్లుప్తంగా

మానవ సేవకు సంపదతో పనిలేదు

కర్నూలు(హాస్పిటల్): మానవ సేవకు సంపదతో పనిలేదని, సహాయం చేయాలన్న ఆలోచన ఉంటే చాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. స్థానిక కల్లూరులోని ఆదిత్య విద్యానిలయంలో కల్లూరు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 మంది మానసిక వికలాంగులకు తన వంతుగా డాక్టర్ శంకరశర్మ సహాయం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పను తొలగించండి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని రెండో వార్డు ఖిల్లావీధి సమీపంలోని పబ్లిక్ లెట్రిన్ ఎదురుగా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దాదాపు వారం రోజుల నుంచి చెత్తను తీయకపోవడంతో కుప్పగా మారిందని, దాని నుంచి వచ్చే దుర్వాసను తట్టుకోలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ చెత్తకుప్పలను తొలగించాలని పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌ఎండీ షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రతిభవంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చెప్పారు. వీరశైవ ఉద్యోగ సమాఖ్య ఆధ్వర్యంలో వీరశైవ ప్రతిభా పురస్కారాల వేడుక శనివారం గుత్తిరోడ్డులోని వీవీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడారు. అనంతరం ఎస్‌ఎస్‌సీ ఇంటర్, నీట్, ఐఐటీ, ట్రిబుల్ ఐటీ, ఎంసెట్‌లలో ప్రతిభ చూపిన, ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వీరశైవ విద్యార్థినీ విద్యార్థులు, ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ ఉద్యోగ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బి. చంద్రశేఖరప్ప, జి.జె.రమేష్, ట్రెజరర్ ఎస్. మల్లికార్జునస్వామి, రిటైర్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విశ్వనాథశాస్త్రి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె. శంకరయ్య, గౌళి సమాజ సంఘం కార్యదర్శి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల పౌరాణిక నటులకు గుర్తింపు నివ్వాలి

కర్నూలు కల్చరల్: రంగస్థల పౌరాణిక నటులకు గుర్తింపు ఇవ్వాలని కళావాహిని కళాసంస్థ అధ్యక్షుడు మనోహర్ బాబు అన్నారు. ప్రముఖ రంగస్థలం నటులు జి.సుబ్బారావు సంస్మరణ సభ శనివారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. కళాకారులు సుబ్బారావు చిత్రపటానికి పుష్పమాల సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శ్రీకృష్ణ రాయబారంలోని పడక సీను, గయోపాఖ్యానంలోని యుద్ధ సన్నివేశం ప్రదర్శించారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి వారం రోజుల పాటు దసరా సెలవులు ఉంటాయన్నారు. సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా కోర్సులకు సంబంధించిన పాఠ్యాంశాలను, కఠిన పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకోవాలని సూచించారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలి



వెయిట్‌లిఫ్టర్‌ను అభినందిస్తున్న బోయ సేవా సంస్థ అధ్యక్షులు తలారి క్రిష్ణ నాయుడు

కర్నూలు (టౌన్) : ఈనెల 6 నుంచి 13 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆకాంక్షించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని తన చాంబర్‌లో క్రీడాదాత శ్రీధర్ రెడ్డి, వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షుడు తలారికృష్ణ నాయుడు జాతీయ పోటీల్లో పాల్గొంటున్న వెయిట్ లిఫ్టర్ బి. వీరేష్‌ను శాలువా కప్పి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలి, కోచ్ యూసుఫ్‌బాషా పాల్గొన్నారు.

పీడిస్తున్న సెరిబ్రల్ పాల్సీ

- చిన్నారులకు పుట్టుకతోనే అంగవైకల్యం
- వెయ్యి మంది పిల్లల్లో 8 మందికీ సమస్య
- ప్రసవ సమయంలో జాగ్రత్తలే శ్రీరామరక్ష



బ్రెయిన్



సమస్యతో బాధపడుతున్న చిన్నారి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి స్త్రీ వివాహమయ్యాక అమ్మా అని పిలిపించుకోవాలని ఎన్నో కలలు కంటుంది. తీరా నెలలు నిండి ప్రసవమయ్యాక పుట్టిన బిడ్డ ఇక జీవితాంతం అవిటిగా ఉండాల్సి వస్తుందని తెలిస్తే ఆ తల్లి గుండె పగిలినంత పనవుతుంది. ఇటీవల కాలంలో ప్రతి వెయ్యి మంది చిన్నారుల్లో 8 మందిని పట్టిపీడిస్తున్న సమస్య సెరిబ్రల్ పాల్సీ. నేడు వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ డే సందర్భంగా ప్రత్యేక కథనంసెరిబ్రమ్ మెదడులో ఒక భాగం. సెరిబ్రల్ పాల్సీ అనేది వ్యాధి కాదు. ఇది ఒక శారీరక, మానసిక రుగ్మత. ఇటీవల కాలంలో చాలా మంది చిన్నారులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. మహిళ గర్భం దాల్చిన సమయంలో ఏదైనా ఇన్‌ఫెక్షన్ కారణంగా ప్రసవ సమయంలో శిశువు మెదడుకు గాయం అవ్వడం, గర్భంలోనే పిండదశలో మెదడు ఎదుగుదలలో లోపం వంటి కారణాలతో ఈ వ్యాధి కలుగుతుంది.

ప్రవర్తన విభిన్నం

సాధారణంగా కండరాల కదలికలు, నరాల సంకేతాలు మెదడు ఆధీనంలో ఉంటాయి. మెదడు నుంచి నరాలు గ్రహించిన సంకేతాలకు కండరాలు పని చేస్తాయి. మిగతా పిల్లలతో పోల్చుకుంటే సెరిబ్రల్ పాల్సీ రుగ్మత ఉన్న పిల్లలు విభిన్నంగా ఉంటారు. పనితీరు, నడవడం, మాట్లాడటం, తినడం, రాయడం, కూర్చోవడం వంటి విషయాల్లో తేడ స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా కండరాలు బిగుసుకుపోవడం, కదలికలో లోపాలు కనిపిస్తాయి.

ప్రతి వెయ్యి మందిలో 6 నుంచి 8 మందికీ సమస్య

ప్రసవ సమయంలో అవగాహనతో సరైన జాగ్రత్తలు పాటిస్తే తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉంటారు. కానీ దురదృష్టవశాత్తూ మన జిల్లాలో సెరిబ్రల్ పాల్సీతో జన్మిస్తున్న పిల్లల సంఖ్య ప్రతి వెయ్యిలో 6 నుంచి 8 మంది దాకా ఉంటోంది. ముఖ్యంగా కొన్ని రకాల సామాజిక వర్గాలకు చెందిన పిల్లల్లో, నిరక్షరాస్యత అధికంగా ఉన్న కోసిగి, ఆలూరు, ఆస్పరి, కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, హాలహర్వి, డోన్, కృష్ణగిరి, తుగ్గలి, చిప్పగిరి, కోడుమూరు, గూడూరు వంటి ప్రాంతాల్లో ఇలాంటి పిల్లలు అధికంగా కనిపిస్తారని వైద్యులు చెబుతున్నారు. ప్రసవ సమయంలో సరైన జాగ్రత్తలు, పోషకాహార లోపం లేకుండా చూసుకోవడం వంటివి తీసుకుంటే ఆరోగ్యకర బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉంది. కాగా రక్తపరీక్షలు, క్రేనియల్ అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ, సిటీస్కాన్ ఆఫ్ బ్రెయిన్ పరీక్షల ద్వారా సెరిబ్రల్ పాల్సీ వ్యాధిని నిర్ధారించవచ్చు.

పలు రకాల థెరపీలు, మందులతో చికిత్స



సెరిబ్రల్ పాల్సీ సమస్యకు మందులతో పాటు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీలను ఇస్తే 30 నుంచి 50 శాతం వరకు పిల్లల్లో మార్పు వస్తుంది. ఆయా థెరపీల్లో తల్లిదండ్రులు శిక్షణ పొంది ఇంటి వద్ద చిన్నారులకు థెరపీ అందించాల్సి ఉంటుంది. ఇంకా ఏమైనా నరాలకు సంబంధించిన సమస్యలుంటే దానికి కూడా మందులు ఇప్పించాలి. కొన్ని సార్లు ఆపరేషన్ కూడా చేయాల్సి రావచ్చు.

–డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు

ఫిజియోథెరపీతో సాధారణ జీవనం



సెరిబ్రల్ పాల్సీతో బాధపడే పిల్లలకు తమంతట తాము పనులు చేసుకునే విధంగా వ్యాయామాలు చేయించాలి. కొందరికి కాళ్లు, చేతులు పనిచేయకపో యినా తెలివితేటలు బాగుంటాయి. మరికొందరికి తెలివితేటలు ఉండవు. ఇంకొందరికి మాటలు కూడా రావు. వారి వారి ఇబ్బందులను బట్టి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయిస్తే వారి జీవనాన్ని సహజత్వానికి దగ్గరగా తీసుకురావొచ్చు.

–డాక్టర్ హనీఫ్, ఫిజియోథెరపిస్ట్, కర్నూలు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ప్రజాభిప్రాయంతో స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక రూపకల్పన
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర–2047 విజన్ ప్రణాళికను తయారు చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ప్రజాభిప్రాయంతో ప్రణాళికను రూపకల్పన చేస్తున్నామని వివరించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర–2047 జిల్లా దార్శినిక ప్రణాళిక రూపకల్పన నిమిత్తం వివిధ వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశమై వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశానికి అఖిల భారత సర్వీసు రిటైర్డ్ అధికారులు రామ్‌శంకర్‌నాయక్, మహ్మద్ ఇక్బాల్ హాజరయ్యారు. కాగా, వీరిద్దరు ఏకంగా స్టేజీపై కూర్చొని ప్రసంగం చేయడంపై వర్కుషాపునకు హాజరైన వారు చెవులు కొరుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏడాదికి 15శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు. ఓర్వకల్ పారిశ్రామిక వాడపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్‌లో 4,470 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినట్లు చెప్పారు. మిగిలిన 5 వేల ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మైనింగ్, క్వారీ పరిశ్రమల ఏర్పాటుకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. రిటైర్డ్ కర్నూలు కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను నిర్మిస్తే తుంగభద్ర నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ..హాస్టళ్లలో వసతులను మెరుగు పరచేందుకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, మైనార్టీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతుసంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో చల్లా కల్యాణి, సీపీఓ హిమ ప్రభాకరరాజు పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశాల కోసం ఈ నెల 7 నుంచి 9వ తేది లోపు అయితే రూ.400 రుసుము, 10వ తేది నుంచి 12వ తేదిలోపు అయితే అదనంగా రూ.100 ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ క్లస్టర్ యూనివర్సిటీ(బిక్యాంపు)లో జరుగుతుందన్నారు. ప్రవేశాల కొరకు విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. మొదటి మూడు దశల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌లలో సీటు పొందడానికి అవకాశం లేదని, ఒక వేళ స్పాట్ అడ్మిషన్ ద్వారా క్లస్టర్ యూనివర్సిటీ కాలేజీల్లో సీటు పొందాలనుకుంటే తాను పొందిన అడ్మిషన్ సీటును రద్దు చేసుకొని స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చన్నారు.

అమ్మవారి దర్శనం..పరమ పావనం





భరతమాత ఆలయంలో సామూహిక పూజలు, నిమిషాంబ దేవి ఆలయంలో అన్నపూర్ణగా అమ్మవారు

కర్నూలు కల్చరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించారు. తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు పూజలు చేశారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక నృత్యాలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, ప్రవచనాలు జరిగాయి. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, ఓల్డ్‌సిటీ బండిమెట్ట అంబాభవానీ ఆలయంలో గాయత్రీదేవిగా, నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరిఆలయం, నన్నూరు సరస్వతీ దేవి ఆలయం, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, బుధవార పేట కాళికాంబ ఆలయంలో అన్నపూర్ణగా, గీతా మందిరంలో వెంకటేశ్వర స్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థులతో కలిసి బయటకు వస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో కూడా నారాయణ విద్యా సంస్థలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాయని, వెంటనే ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ నాయకుల పరిశీలనలో బయట పడింది. దీంతో ఆ సంఘం నాయకులు కాలేజీలకు సెలవులు ప్రకటించినా ఎందుకు తరగతులు నిర్వహిస్తున్నారని కాలేజీ ప్రతినిధులను ప్రశ్నించారు.వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విద్యార్థి సంఘం నాయకులు తరగతుల్లోకి వెళ్లి పిల్లలను ఇళ్లకు పంపించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు 3వ తేది నుంచి ఈనెల 13వ తేది వరకు దసరా సెలవులు ప్రకటించిందని, కానీ జిల్లాలోని కార్పొరేట్ కాలేజీలు ఈ ఆదేశాలను పాటించడం లేదన్నారు. పట్టించుకోవాల్సిన ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. సంఘం నాయకులు విజయ్, దామోదర్, మధు, కౌశిక్ పాల్గొన్నారు.

నగరపాలకలో ప్రక్షాళన!

- టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో మార్పులు,చేర్పులు
- ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్



నగర పాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): నగర పాలనలో కీలకపాత్ర పోషించే నగర పాలక సంస్థలో ప్రక్షాళన మొదలైంది. కొత్త కమిషనర్ రవీంద్రబాబు పలు విభాగాల్లో మార్పులు చేర్పులు చేపట్టారు. దీర్ఘకాలికంగా అదనపు బాధ్యతలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా కొనసాగుతున్న ఏడుగురిని ఆ బాధ్యతల నుంచి తప్పించిన కమిషనర్ తాజాగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో మార్పులు, చేర్పులతో పాటు పలువురికి పని విభజన బాధ్యతలు అప్పగించారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీరే...

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ఎస్. శేషాద్రి రెవెన్యూ వార్డులు 1 నుంచి 39 వరకు అలాగే 41, 42 వార్డులు, 52 నుంచి 68 వార్డులను కేటాయించారు. ఎం. రాజుకు 40 వ వార్డు , 46 నుంచి 50 వ వార్డు వరకు, అలాగే 69 వార్డు, ఎస్. తిప్పన్నకు రెవెన్యూ వార్డులు 70 నుంచి 80 వరకు కేటాయించారు. ఇక పి. భార్గవ్ కు 81 నుంచి 87 వార్డులు, 103 నుంచి 127 వరకు వార్డులను కేటాయించారు. నాగరాజుకు 43 నుంచి 45 వరకు ,అలాగే 45, 51, 88 నుంచి 102 వరకు రెవెన్యూ వార్డులు కేటాయించారు. ఈ వార్డుల్లో రెవెన్యూకు సంబంధించిన అన్ని వ్యవహారాలు, పన్ను వసూళ్ల తదితర వాటిని కొత్తవారే పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.

టౌన్ ప్లానింగ్‌లో...

నగరపాలకలో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ మార్పులు, చేర్పులు చేశారు. ఇటీవల టీపీఎస్‌లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో జోన్ నుంచి టీపీఎస్ కార్పొరేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. భవన అనుమతులు, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నులు, ఆక్రమణల ఫీజులు, ఎల్ ఆర్ఎస్, బీపీఎస్ వంటి కీలకమైన పనులు చేపట్టాల్సి ఉండటంతో కమిషనర్ ఈ విభాగంలో పని విభజనపై దృష్టి పెట్టారు. టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ ఇ. దామోదర్‌కు 1 నుంచి 13 వార్డులు, అలాగే 25 నుంచి 27, 29 నుంచి 33 వార్డులు, 35 వార్డు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ షేక్ అంజాద్ బాషాకు 14 నుంచి 24 వరకు, 25 వ వార్డు, అలాగే 34, 36, 37 వార్డులు, 38 నుంచి 41 వార్డులు, 42 నుంచి 52 వార్డులు, ఇక టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మస్రత్ ఆలీఖాన్‌ను నగరపాలక సంస్థ పరిధిలో వాణిజ్య ప్రకటనల ఆదాయ వసూళ్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరతతో ఇప్పటికే అనేక ఇబ్బందులు వచ్చాయి. పనుల్లో జాప్యం, ఫిర్యాదులపై స్పందించకపోవడం, అవినీతి ఆరోపణలు, దీర్ఘకాలికంగా వాణిజ్య ప్రకటనల ఆదాయాలను పర్యవేక్షణ చేయకపోవడం, వసూళ్లలోనూ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి సంఘటనలు ఆ విభాగంలో నెలకొన్నాయి.

ఇంజినీరింగ్‌లో బ్యాలెన్స్ తప్పిన పని విభజన

అయిన వారికి అరిటాకుల్లో కానీ వారికి కంచాల్లో అన్న చందంగా నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో పని విభజన చేశారు. బదిలీ కాకుండా ఇక్కడే ఉన్న ఓ ఈఈకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగంలో కీలకమైన వాటర్ వర్క్స్‌లో గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. కోట్లాది రూపాయలతో సి. బిల్లులు చేసి ఇష్టానుసారంగా దోపిడీ చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. తిరిగి ఆ ఈఈకే మళ్లీ అవే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఆయనకు కావాల్సిన వారికే డీఈఈలను, ఏఈలను కేటాయించారు. ఇప్పటికే ఏడాది కాలంగా వాటర్ వర్క్స్‌లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులు సైతం దృష్టి పెట్టారు. ఇక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లలో ఎస్. సత్యనారాయణ రావుతో పాటు పి.వి. శేష సాయి ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పని విభజన చేశారు. అయితే, ఒక ఈఈకి మాత్రమే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంపై విమర్శలు ఉన్నాయి. ఈఈ శేషసాయి పరిధిలో డీఈఈలు గా జి. మనోహర్ రెడ్డి, సి.నరేష్, డి.వి. కృష్ణలత, జి. గంగాధర్, గిరిరాజు అను కేటాయించారు. మరొక ఈఈ సత్య నారాయణకు నామా మాత్రపు బాధ్యతలు కేటాయించారు. దీంతో మరోసారి వాటర్ వ ర్క్స్‌లో అవినీతి చేసేందుకు లైన్ క్లియర్ అయిందన్న అభిప్రాయం ఆ శాఖలో మొదలైంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలి

- ఇండస్‌లో 5 వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



చాంపియన్‌షిప్ పోటీల్లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న యోగా క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని మాజీ మంత్రి కె.ఈ. ప్రభాకర్, మాంటిస్సోరి ఇండస్ చైర్మన్ రాజశేఖర్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ఇడస్ పాఠశాల క్రీడా మైదానంలో 5 వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ యోగ క్రీడకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ పోటీల్లో 450 మంది యోగా క్రీడాకారులు 57 మెడల్స్ కోసం పోటీపడుతున్నారన్నారు. యోగాసన ఫౌండేషన్ అనుబంధ సంస్థగా రాష్ట్ర క్రీడా శాఖ ప్రభుత్వ అనుమతితో ఒలింపిక్ అసోసియేషన్‌లో యోగా క్రీడ నమోదైందన్నారు. క్రీడల్లో రాణించే క్రీడాకారులకు కేంద్ర , రాష్ట్ర సంస్థల్లో 2 శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధికా, ఉపాధ్యక్షుడు బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ మూడు రోజుల పాటు యోగాసన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, అసోసియేషన్ కోశాధికారి మల్లికార్జున, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివరాజ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా గ్రంథాలయానికి పుస్తకాలను ప్రదానం చేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ సూచన మేరకు శనివారం జిల్లా కేంద్రాలయంలో వివిధ పోటీల పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, టెక్నికల్ లైబ్రేరియన్ ఎస్.బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్ పుస్తకాలను గ్రంథాలయానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పాఠకులు, ప్రజలు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌కు అభినందనలు



డాక్టర్ సింధియా శుభప్రదకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): గతంలో సంవత్సరానికి ఒక బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడం కూడా ఇబ్బందిగా ఉండేదని, అయితే ఈ సంవత్సరంలో జులై నుంచి అక్టోబర్ మొదటి వారంలోనే 5 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేయడం అభినందనీయమని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. మంచి అనుభవజ్ఞులైన మెడికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ మన వద్ద ఉండటంతో ఇది సాధ్యమైందన్నారు. కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు ఎంఈయు కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ఎన్‌ఎంసీ నోడల్ సెంటర్ భాస్కర మెడికల్ కాలేజి అబ్జర్వర్, వికారాబాద్ మెడికల్ కాలేజి మైక్రోబయాలజి ప్రొఫెసర్ డాక్టర్ మొహమ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయానంద బాబు, ఎంఈయు సభ్యులు డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ విశాల, డాక్టర్ అరుణ, డాక్టర్ కుముద, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ గాయత్రి, డాక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



దుకాణాదారులతో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారిని శారద

కర్నూలు న్యూసిటీ: 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణ అధికారిని టి.శారద హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నగరంలోని పాత బస్టాండ్, కంట్రోల్ రూమ్, రాజ్‌విహార్, బంగారుపేట, కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లోని దుకాణాల్లో సోదాలు చేపట్టారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి మందలించారు.. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం సిబ్బంది లక్ష్మి, దీప, నరసింహులు, నాగేశ్వరరావు, శ్వేత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలలో రోగనిరోధక శక్తి



టీకాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని, అవి పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక గడ్డవీధి యూపీహెచ్‌సీ పరిధిలోని 16వ సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి ప్రసవమైనా పుట్టిన గంటలోపే బిడ్డకు పాలు పట్టించాలన్నారు. పుట్టిన బిడ్డ మొదలు ఐదేళ్లలోపు వారందరికీ సకాలంలో టీకా అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎప్పుడైనా టీకా వేయించడం మరిచిపోతే ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా బిడ్డకు ఇప్పించాలన్నారు. టీకాల వల్ల కంఠసర్పి, క్షయ, అంధత్వం, కోరింతదగ్గు, కామెర్లు, అతిసారం, పోలియో, నిమోనియా వంటి వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు రమీజా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని ప్రతి కార్యాలయం వెలుపల ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని డీఆర్వో టి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఆర్‌టీఐ–2005 చట్టం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్‌టీఐ కార్యకర్తలు అడిగే సమాచారం కోసం రికార్డులను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఇందుకోసం రిజిస్ట్రార్–1, 2లను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.